# ఏటుకాడు

ఇంగ్ ఇంగీ పదిరోజులూ ఏసోబు దగదగా ఎలిగిపోతాడు. ఏడాది పొడుగూనా కుంటి కుక్క మాదిరి ఏటుకాలేసుకొని[1] తిరుగుతా, యిళ్ళనూ వాళ్ళనూ ఎంగిలి బీడీలు అడుక్కొంటా వుంటాడు. ఇదో.... యీ పదీ పన్నెండు రోజులూ మాత్రం ఏసోబు పరాక్రం సెప్పతరం కాదు. శివరాత్రి, ఉగాదీ సందున ఆకాసెంలో ఆ పొద్దు[2] గదా కండ్లు సెదిరేట్టుగా కనపడ్తాంటాదే అట్ట ఏసోబు కూడా ఉగ్గరంగా[3] వుంటాడు. ఏడాదంతా ఇంట్లో పెండ్లానికీ కోడండ్లకూ బయపడ్తే ఈ రోన్నాళ్ళూ ఏసోబున్జూసి వాళ్ళు బయపడ్తారు. "ఏంపంగుజేసి అల్సిపోయినావని పొద్దుబారెడెక్కే దాకా గోడకు నిగడదన్ని పండుకోనుండావు.... లెయ్యశా" అని, ఏసోబు పెండ్లాం మరియా సేత్తో అంటే సేత్తో, కాల్తో అంటే కాల్తో జాడిచ్చి లేపేది. ఇప్పుడట్ట లేపడానికి జంకుతాది. మాపటేల మామ కల్లాల్లోంచీ ఇంటి కొచ్చేతలికి కోడండ్లు ఉడుకు నీళ్ళు లడీ జేస్తారు పోసుకోడానికి.

ఊళ్ళో పెద్దోళ్ళంతా యీ పది రోజులూ ఏసోబు ఇంటి సుట్టూ తిరుగుతాంటారు. ఏసోబు నిద్దర లేయకముందే అతగాని కొట్టం కాడికి పోయి "ఏలుకోరా ఏసోబూ" అని మేలుకొలుపు పాడతాంటారు. "మరియమ్మా, మనవాడు నిద్దర లేసినాడా" అని మరియాదగా అడిగి.... "అవులే వాముల మీంద పనంటే మాటలా ? పుల్లిక[5] జేసుంటాది" అని కనికరం జూపుతారు. అప్పుడు మరియా మొగున్ని తట్టి 'ఇదో లేయ్, లేయ్యే' అంటూ పలానా ఆయనొచ్చినాడని సెపుతాది ఏసోబు మూల్గుతా యిసుక్కొంటా 'ఏందే నీ....' అని పెండ్లాన్నీ ఆ వచ్చినాయన్నూ కలిపి తిట్టినట్టు తిడ్తాడు. బయటున్న మనిషికి ఇనబన్నా సేసేదేం లేదు. "దగ్గుతాబోతే సొంటి పిరెమేమరి" అనుకొని సవరిచ్చుకొని, యినపడనట్టుంటాడు. ల్యాకపోతే, సొంటి పిరెమాయెనే అని కంటికి సొంటేసుకుని ఏడిస్తే కంటి సేటు కర్సు సేటు.... అంతేగదా !

ఉత్తప్పుడయితే యాన్నన్నా దావన ఎదురైె ఏసోబు ఒక తుంట బీడీ అడిగినా "పోరా నా కొడకా ! నీకు పొద్దున లేసిన కాన్నించీ బీడీలు యాడిచ్చేది" అని తిడ్తారు. ఇప్పుడయితే బీడీలేంది సికిరేట్లు తెప్పియ్యమన్నా తెప్పిస్తారు. సిల్మాకు పోవాల లెక్కియ్యమన్నా లేదన్లేరు, "మా పని అయినాక పోరా నాయనా" అని బంగపోవాల. "పొద్దంతా పన్జేసేతలికి మాసిటేలకల్లా వొళ్ళు నొప్పుల్జేస్తాయి" అని ఏసోబు అంటే, పని అయిపోయినోడు సయిగ్గాకుండా వుంటాడు గానీ మరుసట్రోజు పనున్నోడు పరిగెత్తి పోయి సారాయి పంపియ్యాల ! ఏసోబు పెండ్లామో, కోడండ్లో అంతకు ముందు కూలి ముంతలు బాకీ వున్నాసరే పట్టుకోరు. ఏసోబు కూలి ఇరవై రూపాయిలూ వామి దిగేసరికి.... 'యిదో సామీ' అని ఇచ్చి తీరాల. ఏసోబు మాంచి ఏటుకాడు.

వాని సెయ్యి బడిన వామి ఎన్నేండ్లున్నా. సెదదని అందరూ అంటారు. ఏసోబు గాక ఇంగా ఇద్దరు ముగ్గురు ఏటుకాళ్ళు ఊళ్ళో వుంటారు గానీ వాళ్ళంత మేలైన పనోళ్ళు గాదు. సిన్నా సితకా

1) ఒక కాలు కొద్దిగా ఈడుస్తూ నడవడం 2) సూర్యుడు
3) ఉగ్రంగా 4) స్నానానికి 5) అలసట

వాములయితే పరవాలేదుగానీ పెద్దయైతే రోన్నాళ్ళకల్లా వొరిగిపోయేట్లో, నది వామిలో నీళ్ళు దిగేట్లో ఏస్తారు. అందుకే పెద్ద వాములోళ్లంతా ఎట్టనోకట్ట ఏసోబు సేతనే ఏయిచ్చుకొంటారు. ఏసోబు మళ్ళా మంచి సేద్యెగాడేం కాదు, ఉదరా బదరా సేద్యెగాడే. వాము లేయడంలో వాని పన్తనం[7] సూడాల. వామి బద్రంగా యేయడమే కాక పనిలో మంచి సేతాళం[8] జూపుతాడు. దండిగా మేత వుండే వామికి ముందు అంజనేయుని అకారం కనిపిచ్చేట్టు ఏస్తాడు. మేత ఇంగా ఎక్కువగా వుంటే రొండు వాముల్నీ కలిసి వంతెన కట్టినట్టు జాయెంటుగా ఏస్తాడు.

“ఏసోబుకు రోంత జంబం[9] వుంది గానీ వామి ఏసినాడంటే వానమ్మా నా కొడుకు వాడే ఎయ్యాల” అంటారంతా. పాత వాముల్ని జూసినా యిది ఏసోబు ఏసిందేనని కనిపెట్టొచ్చునంటారు. కల్లంలో వాడుంటే ఎక్కల్లేని వుశారు. మేత మోసే కూలోళ్ళను ఆడా మొగా అని సూడకుండా తిడ్తాడు. అందరూ నగుతారే కానీ కొట్లాడరు. తిట్టకుంటే ఏసోబు ఎట్టయితాడులే అన్నట్టుంటారు. అంటే, కూలోళ్ళలో వాళ్ళ వాళ్ళు ఎక్కువగా వుండడం కూడా ఒకట్లే. ఉత్తప్పుడు పానంబోయే వాని మాదిరిగా వుండే ఏసోబుకు ఏటుగాడై పన్లోకి దిగుతానే అంత వొడుపూ శకితీ యాన్నించీ వొస్తాయో తెల్దు. రొండు సేతుల్తో వామ్మింద నుంచీ జవురుకొని అందుకుంటా, సేతుల్తో కాళ్ళతో యాడి మేత అడ తొక్కుతా, సరి సేసుకొంటానే వుంటాడు. ఇంగో పక్క మేత రాలేదని ఎచ్చరిస్తా వుంటాడు.... అర్జునుడు గదా యుద్దెం జేసినట్టే అనుకో.

రొండు కండ్లతో ఆ పనివాటం సూసినోడు, “ఏందిరా యీడు పన్లోకి దిగినప్పుడు యిట్టా సేస్తాడు గదా, మల్లా ఏడాదంతా ఊరికెట్టావుంటాడబ్బా” అనుకోకుండా వుండడు. ఒక పారి మూలోళ్ల గోయిందరెడ్డి వామి ఏసేతప్పుడు, కూలోళ్ళు కూకోని సంగటి తింటా వుండగా, ఆయనిదే అడిగినాడు. ఏసోబు సంగటి తినడం సాలిచ్చి, నగుతానే సుగిచ్చినట్టు - సెప్పినాడు. “గోయిందరెడ్డీ, నీకు మూడు కాండ్ల ఎద్దులుండాయి. అందులో రొండు కాండ్లు రోజూ సేద్యెం సేస్తాయి, ఒక్కాడి నువు బండ ఈడ్సడానికి మేపే కోడెలు గదా ! పందెపు కోడెల్తో నువు రోజూ సేద్యెం సేయిచ్చవు. ఒకేల నువు సేయిచ్చాలనుకొన్నా అయి సేయవు మామూలు ఎద్దులాల[10] అయి ఎండకూ గాలికీ తట్టుకోలేవు. బండ ఈడ్సడంలో వాటి బలం శౌర్రం సూడాల. అట్టనే సేద్యెపు ఎద్దులు సచ్చినా బండను జానెడు గుంజలేవు, ఇయి సేద్యెం జేయాల, అయి బండ ఈడ్సాల.... అంతే” అని సేతిలో అంతవరకూ వుంట సేస్తావున్న సంగటిని గుటుక్కున నోట్లో ఏసుకొనె.

ఒక రకంగా సెప్పాలంటే ఏసోబు ఏడాదంతా బతికినట్టుకాదు, సావును మోసుకొంటా వున్నెట్టే. ఈ వాములు ఏసినన్ని రోజులూ మాత్రం బతికినట్టు. ఈ గ్యాపకమే ఏడాది బతుక్కూ బలం. కరెట్టుగా సెప్పాలంటే ఉర్వువూ[11] సెయ్యనే సెయ్యడనికాదు, యాదో సేసినా యిట్టపడి కాదు, ఇది ల్యాక ! ఊళ్ళో వాళ్ళకు వాములేయాల్చిన యీ నాల్రోజులూ తన సుట్టూ తిరిగినా అవతల తన మొగం సూదరని ఏసోబుకూ తెల్చు. వాళ్ళు సూడక పోయినా తానేసిన వాములు తనను సూస్తాయి, తాను

---

6) గడ్డివాములు 7) పనితనం 8) నైపుణ్యం, శిల్పం
9) తలపొగురు 10) ఎద్దులవలె 11) బొత్తిగా

వాటిని సూస్తాడు, అది సాలు. కల్లాల్లో వాముల దిక్కు సూస్తే "ఏం ఏసోబూ నువ్వే గదూ మమ్మల్ని ఏసిందేది" అని అయి పలకరిచ్చినట్టుంటాది. ఏసోబు నాయన సామేలు గూడా ఏటుకాడే గానీ, ఏసోబు నాయన్ను మించిన కొడుకు అనిపిచ్చుకున్నాడు. వామి బిగిచ్చి దిగినాక, 'ఎట్టుంది వామి' అనడిగితే, రంబా ఊరవాసాల వుందనాల్చిందే ! ఏసోబును 'ఏసోబూ' ! అని నగుతాపిలిస్తే 'ఊ....' అని మూలుగుతాడు. 'ఏంరో ఏటుగా' అని ఎగతాలిగా పిలిస్తే నగుతా పలుకుతాడు. అట్టాటి ఏసోబుకు ఎన్నడూ ఎరగని దెబ్బ తగిలె. ఆ రోజు ఏసోబు ఎంగటసామి వామి ఏసినాడు. పనంతా అయిపోయి అప్పుడు కూలోళ్ళు కళ్ళంలో ఆడాడ దుమ్ములో వున్న గడ్డిని ఒక సాటికి ఊడ్సుతాండారు. ఏసోబు సిన్న కోడలు ఎనుముకు రోంత మేత కోసమని గంప సంకనేసుకోని వచ్చింది కల్లంకాడికి. గంప పెద్దదేం గాదు మల్ల సిన్నదే. ఈనడమ ఆమె పుట్టింటోళ్ళు ఆమెకు ఎనుమును దోలిచ్చినారంటలే. కోడల్దెచ్చిన గంపలో ఏసోబు యింత గట్టి దురుముతాండంగా కల్లం గోడ మీద కూకోనున్న ఎంగటసామి కొడుకు వాల్లె[12] వూడి పోయేట్టు పరిగెత్తా వచ్చి, అమ్మనూ అక్కనూ తిట్టబట్టె. "నీ మొగుడు యీడ వామేసినాడని గంప తీసుకొచ్చినావా కులుకుతా?" అని ఏసోబు కోడల్ను తిట్టె.

ఏసోబు ఏం మాట్లాడకుండా గంపలో మేతను కల్లంలోనే కుమ్మరిచ్చి గంప కోడలికిచ్చినాడు. తలకాయ పైకెత్తుతానే అప్పుడే పూర్తిచేసిన వామికనపడె అరవై, డెబ్బయి బండ్ల మేతకు తక్కువుండదు. తలకాయ యీ పక్కకు తిప్పుకొందామంటే, తను నిన్నేసిన నారాయణరెడ్డి వామి కొండాల కనపడె. ఆ పక్కకు తిప్పుకుందామా అంటే మొన్నేసిన ముని్రెడ్డి వామి పెద్ద గుట్టాల కనపడె. ఇంగ తలకాయ ఎట్టా తిప్పకుండా వొంచుకొని కోడల్తోపాటు ఇంటికి నడ్సె. ఆకల్లేదని బువ్వ తినకుండా పండుకొనె. సగిరపొద్దున మరియాకు మెలుకువొచ్చి సూస్తే గోడకానుకుని కూకుని ఒకటే మొయిన బీడీలు తాగుతాండాడు. 'యాన్నన్నా నొప్పిగా వుందా?' అనడిగితే 'అవు' అనె. 'యాడ?' అంటే, 'యాన్నని సెప్పేది?' అనె నిదానంగా. 'ఒళ్ళంతా నొప్పుల్జేసిందేమోలే' అని మరియా అనుకొంది.

తెల్లవార్నాక "వామేయను రమ్మని నాగయ్యొచ్చినాడు.... లే" అని లేపితే "నేను పోను పో" అని ఆ పక్కకు తిరిగినాడు. "ఈ పొద్దు రాలేదని సెప్పమంటావా, ఇవరంగా సెప్పవేంది!" అని గట్టిగా అడిగితే, సివుక్కున లేసి కూకున్నాడు.

"ఇనే.... ఇనుమల్లా, ఇవరంగా సెప్తాందాయిను. యీ పొద్దే గాదు యే పొద్దు గుడకా నేను ఇంగ వాములేయను పోను" అని ఎర్రోని మాదిరిగా అర్సినాడు. అర్సి, వొనుకుతాండే సేతుల్తో పక్కనే వున్న తుంట బీడీల కువ్వలోంచీ ఒకటి తీసుకొని ముట్టిచ్చుకొని.... గోడకానుకొనె.

---

12) పంచె